క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వీరబల్లి, రామాపురం, గాలివీడు మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు తదితర పోస్టులకు స్థానికులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందరూ 10వ తరగతి పాసై ఉండాలన్నారు. మూడు మండలాలలో 4 వర్కర్లు, 7 ఆయా పోస్టులు ఉన్నాయని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో అప్పగించాలన్నారు. పూర్తి వివరాలకు లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ అధికారిని సంప్రదించాలన్నారు.

అటవీ సంరక్షణపై వ్యాసరచన పోటీలు

సిద్దవటం : మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అటవీ సంరక్షణపై వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్ తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజర్ ఓబులేస్ మాట్లాడుతూ రేంజర్ ప్రసాద్ ఆదేశాల మేరకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించామన్నారు. అటవీ సంపద, జంతువుల సంరక్షణపై అవగాహన కలిగించేందుకు ఈ పోటీలను నిర్వహించామన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులను అందజేస్తామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ఇంటర్ పరీక్షలు


పరీక్షా కేంద్రానికి పరుగులు తీస్తున్న విద్యార్థులు

సంబేపల్లె : మండల పరిధిలోని యర్రగుంట సమీపంలో ఉన్న బాలయోగి గురుకుల కళాశాలలో సోమవారం ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రంలో సంబేపల్లె, చిన్నమండెం ఆదర్శ కళాశాలలు, దేవపట్ల, యర్రగుంట్ల కళాశాలలకు సంబంధించి 296 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి వుండగా 291 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్‌ను అమలు చేసినట్లు ఆయన తెలిపారు.

అర్జీదారులకు అన్నదానం


అర్జీదారులకు అన్నం వడ్డిస్తున్న నాయకులు

రాయచోటి టౌన్ : అన్నమయ్యజిల్లా కేంద్రమైన రాయచోటి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు చితంగా భోజనం అందిస్తున్నారు. ప్రతి సోమవారం అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్జీదారులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ మదనపల్లె పరిశీలకుడు హబీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, సుగవాసి శ్యామ్, జీవీద్ అమీర్ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం


ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందించిన దృశ్యం

సంబేపల్లె : ఫిబ్రవరిలో జరిగిన పాఠశాల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఉపయోగపడతాయన్నారు. కాకినాడకు చెందిన క్రియా సంస్థ బహుమతులు అందజేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే, ఎండీ మండల పర్యటన

ఓబులవారిపల్లె : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల , ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి నేడు మంగళవారం మండలంలో పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ వి.సాయికిషోర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు కొర్లకుంట గ్రామంలోని శ్రీ అంకల పరమేశ్వరి దేశాలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఏపీఎండీసీ పాఠశాల వార్షికోత్సవంలో వారు పాల్గొననున్నారు.

భవిష్యత్తు చిరుధాన్యాలదే

- అవగాహన సదస్సు, ర్యాలీలు నిర్వహించిన అంగన్‌వాడీలు
- ప్రతి కుటుంబం చిరు ధాన్యాలను వినియోగించాలంటూ సూచన


రైల్వేకోడూరు అర్బన్: విద్యార్థులకు చిరుధాన్యాల గురించి వివరిస్తున్న సీడీపీఓ


లక్కిరెడ్డిపల్లి: విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : అత్యంత విలువైన పోషక పదార్థాలలో రారాజు చిరుధాన్యాలని భవిష్యత్తు చిరు ధాన్యాలదేనని సీడీపీఓ సౌభాగ్యమ్మ సోమవారం తెలిపారు. పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూల్‌లో ఎంపీడీఓ నాగార్జున అధ్యక్షతన పోషణ పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల ప్రాధాన్యత తెలుకోవాలని తెలిపారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించాలన్నారు. ఆరోగ్యంగా జీవించాలంటే చిరుధాన్యాలు ఒక్క పూటైనా తినాలన్నారు. కార్యక్రమంలో సరళ, అనసూయ, మణెమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన కల్పించండి

లక్కిరెడ్డిపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ్ పఖ్వాడాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ ప్రజలలో పోషకాలను పెంపొందించుటకు ప్రజలు చిరుధాన్యాలను వాడాలన్నారు. చిరుధాన్యాల వల్ల ఆరోగ్యంగా ఉంటారని, కావున ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలపైనే అవగాహన పెంచుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం పౌష్టికాహారాన్ని వివిధ వంటకాల ద్వారా పిల్లలకు వడ్డించాలన్నారు. ఈ పోషణ్ పఖ్వాడా కార్యక్రమానికి వైద్య, ఆరోగ్య, అంగన్‌వాడీ పంచాయతీ సెక్రటరీ, మహిళా పోలీసులు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలపై ప్రజలకు అవగాహన కల్పించి చిరుధాన్యాలను ప్రతి కుటుంబం వాడేటట్టు చూడాలన్నారు.

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి


ఫ్యాన్‌లను అందజేస్తున్న పోలా శ్రీనివాస్‌రెడ్డి

రాజంపేట టౌన్ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం కాగలదని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థుల సౌకర్యార్థం చైర్మన్ పదిహేను సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. ఈ ఫ్యాన్లను సోమవారం ఆ హాస్టల్ అధికారిణి శోభారాణికి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలా శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. హాస్టల్‌లో చదివే విద్యార్థులంతా నిరుపేదలని, అందువల్ల ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎంత పెద్ద చదువులు చదివినా ప్రభుత్వమే జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా మొత్తం ఫీజులు చెల్లిస్తుందన్నారు. పేద విద్యార్థులకు తనవంతు చేయూతనిచ్చేందుకు ఎప్పుడు ముందుంటానన్నారు. హాస్టల్ అధికారిణి శోభారాణి మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ చైర్మన్ హాస్టల్‌ను సందర్శించినప్పుడు హాస్టల్‌లో ఫ్యాన్‌ల కొరత ఉందని తనతో పాటు విద్యార్థులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి తన సొంత నిధులతో ఫ్యాన్‌లు అందజేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు పెనిగిలపాటి పెంచలయ్యనాయుడు, డొంకా సూరి, న్యామతుల్లా, సంఘసేవకుడు రాజాశరత్, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు తోట లక్ష్మీనారాయణ, అబ్దుల్ మునాఫ్, బిళ్ళా నరేష్, ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

పక్కాగృహాలను వేగవంతం చేయాలి

మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి



సిద్దవటం : ఉగాది పండగలోపు పక్కా గృహాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలానికి 1116 పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. ఇందులో భాగంగా ఉగాది పండగ రోజు 246 గృహాల లబ్ధిదారులు గృహప్రవేశం కార్యక్రమాన్ని చేస్తారన్నారు. సిద్దవటం గ్రామ పంచాయతీలో పక్కా గృహాలను వేగవంతంగా నిర్వహిస్తామన్నారు. మాధవరం-1, మాధవరం-2, జ్యోతి, వంతాటిపల్లె గ్రామ సచివాలయాల్లో ఇప్పుడిప్పుడే గృహ నిర్మాణాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గృహ నిర్మాణాల్లో ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమన్నారు. గృహ లబ్ధిదారులకు మంజూరైన గృహాలను త్వరాగా పూర్తి చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెలాఖరులోపు పక్కా గృహాలను లబ్ధిదారులు పూర్తి చేసుకున్నట్లయితే రూ.1.80 లక్షలు వారి ఖాతాలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిరాజకుమారి, తహసీల్దారు శంకర్‌రావు, ఈఓపీఆర్డీ బి.పులిరామ్‌సింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, పోలీసుల అక్రమ అరెస్టులు, నిర్బంధానికి నిరసనగా అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నా చేశారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రామాంజులు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కన్నా వెయ్యి రూపాయల జీతాన్ని అదనంగా పెంచుతానని ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నేటివరకు అమలు చేయలేదన్నారు. వంట సరుకులు, కూరగాయల బిల్లులు, ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లులు 6 నెలల నుంచి చెల్లించలేదన్నారు. మార్చి 30వ తేదీలోపు చెల్లించకపోతే వాటి కోసం ఉద్దేశించిన బడ్జెట్ వెనక్కు వెళుతుందంటూ తెలియజేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం, తమ గోడును పాలకులు చెప్పుకోవడం కోసం అంగన్‌వాడీ రాష్ట్రకమిటీ ఇచ్చిన చలో విజయవాడ పిలుపును భగ్నం చేసేందుకు పాలకులు శత విధాలా ప్రయత్నం చేశారన్నారు. ధర్నాకు అంగన్‌వాడీలు వెళ్ళకుండా పోలీసుల ద్వారా ఎక్కడికక్కడ నోటీసులు ఇచ్చి ముందస్తుగా బస్టాండులు, రైల్వేస్టేషన్‌లలో అరెస్టు చేయడం, గృహ నిర్బంధంలో ఉంచడం దుర్మార్గమన్నారు. ఉద్యమాలను అణచివేయాలనే ధోరణిని పాలకులు వెంటనే మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎస్.ఫయాజ్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, నాయకురాళ్లు సిద్దమ్మ, విజయమ్మ, నాగమణి, సుకుమారి, రమణమ్మ, ప్రభావతి, ఓబులమ్మ, జయమ్మలతో పాటు పెద్దసంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే టెక్ మారథాన్



విజేతలకు నగదు అందజేస్తున్న అభిషేక్‌రెడ్డి

రాజంపేట : విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు టెక్ మారథాన్ లాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఏఐటీఎస్ ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి అన్నారు. సోమవారం ఏఐటీఎస్‌లో నిర్వహించిన టెక్ మారథాన్ ముగింపు సభలో అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్లేస్‌మెంట్‌లో సత్తా చాటేందుకు టెక్ మారథాన్ లాంటి కార్యక్రమాలు అవసరమన్నారు. ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏఐటీఎస్ యాజమాన్యం తమవంతు బాధ్యతగా కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, స్మార్ట్ బ్రిడ్జి డైరక్టర్ యుక్తేష్, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డా.ఎం.సుబ్బారావు, కార్యక్రమం కో-ఆర్డినేటర్ మహ్మద్‌రఫీ, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, డీన్స్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టెక్‌మారథాన్‌- 23 విజేతలు వీరే

టెక్ మారథాన్‌- 23 విజేతల వివరాలను ఏఐటీఎస్ వెల్లడించింది. మొదటి బహుమతి సాధించిన వారిలో అభిరూప, అయ్యవారమ్మ, భవ్యశ్రీ, హసీనా, హైందవి (బ్లూమింగ్ టెక్నాలజీ ప్రాజెక్టు), రెండవ బహుమతి సుదర్శనరెడ్డి, సువర్ణ, కె.సువర్ణ, వంశీకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, (ఈఈఈ ప్రాజెక్టు) కింద విజేతలుగా నిలిచారు. ది ఎలైట్స్ ప్రాజెక్టు కింద అఫ్రీన్, హేమలత, జయశ్రీ, అశ్విన్, శివాలీ, పూజితలు తృతీయ బహుమతిని సాధించారు. డ్రాకరైస్ ప్రాజెక్టు కింద భవిత, కల్పనా, దీక్షిత్, ధనుష్, అహ్మద్, సి.కార్తీక్, గణేష్‌లు విజేతలుగా నిలిచారు.

పంచలోహ ఢమరుకం వితరణ

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీప మల్లయ్యకొండపై ఉన్న శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి కురబలకోట మండలం అడవిపల్లెకు చెందిన శివశంకర్‌రెడ్డి నిర్మలమ్మ కుటుంబ సభ్యులు కాశీపంచలోహ ఢమరుకాన్ని వితరణగా ఇచ్చారు. సోమవారం మల్లయ్యకొండకు భక్తులు పోటెత్తారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. గౌరమ్మకుట్టలో వెలసిన గౌరమ్మకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయల ధర్మకర్తలు ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణ అవసరం

సిద్దవటం : విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని సిద్దవటం ఎస్ఐ తులసీ నాగప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ నలంద హైస్కూల్‌లో సోమవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దవటం ఎస్ఐ తులసీ నాగప్రసాద్, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ రాహుల్, ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు క్రమశిక్షణను, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అలవరుచుకోవాలన్నారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడలు కూడా అవసరమన్నారు.

పక్షులను కాపాడాల్సిన బాధ్యత మనందరిది


పిచ్చుకల ఆవశ్యకతను వివరిస్తున్న హరికృష్ణ

పుల్లంపేట : ప్రస్తుత కాలంలో పక్షులు అంతరించిపోతున్నాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మండల పరిధిలోని పుత్తనవారిపల్లెకు చెందిన హరికృష్ణ తెలియజేశారు. సోమవారం జాతీయ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకొని పుల్లంపేట ఎస్‌బీవీడీ సభా హైస్కూల్‌లో విద్యార్థులకు పిచ్చుకుల ఆవశ్యకత గురించి తెలియజేశారు. ప్రతి ఒక్కరూ పక్షులు అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం హరికృష్ణ పలు గ్రామాలను తిరుగుతూ పిచ్చుక గూళ్లను ఉచితంగా అందిస్తున్నారు.

హిందీ భాష సరళమైనది


బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ప్రతిభా పరీక్షలో సత్తాచాటిన విద్యార్థులకు సోమవారం ప్రధానోపాధ్యాయుడు నీలకంటేశ్వరరాజు, ఉపాధ్యాయులు గుర్రప్ప, ఆవుల వెంకటేష్, హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సత్తార్ హుస్సేన్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ హిందీ భాష చాలా సరళమైన భాష అన్నారు. పదోతరగతి హిందీ పరీక్షలో విద్యార్థులు 90కి పైగా మార్కులు సాధించాలన్నారు.

జగనన్న పాలవెల్లువతో పాడి రైతులకు ఆదాయం


మాట్లాడుతున్న మండలాధికారులు

రామాపురం : జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు అధిక ఆదాయం చేకూరుతుందని అమూల్ డైరీ అధికారి ఉదయ్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో సోమవారం జగనన్న పాల వెల్లువ లక్ష్య సాధనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ అమూల్ ప్రాజెక్టు ద్వారా పాలకు అధిక ధరలు రావడమే కాకుండా పశువుల దాణా, అత్యంత పోషక విలువలు కలిగిన దాణాలను మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకు అందిస్తామన్నారు. పాలు కొలిచే కార్యదర్శులకు ఒక లీటరకు రూ.1 తక్కువ కాకుండా కమీషన్ ఇస్తామన్నారు. ఆరు నెలలు క్రమం తప్పకుండా పాలు డైరీకి పోసిన పాడి రైతులకు పేమెంట్ సభ్యులుగా గుర్తింపు కల్పిస్తామన్నారు. పాలలో వెన్న శాతం పెరిగేకొద్ది పాల ధర పెంచుతామన్నారు. మోసాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా పాలు కొలత నిర్వహిస్తామన్నారు. మహిళా డైరీ సహకార సంఘాలు జిల్లా కో-ఆపరేటివ్ అధికారులు వెలుగు అధికారులు పశుసంవర్ధశాఖ అధికారులు ఏపీ డైరీ డెవలప్‌మెంట్ అధికారులు అమూల్ అధికారుల భాగస్వామ్యంతో పాలు సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో కో-ఆపరేటివ్ అధికారి సురేష్, నిరంజన్, అర్జున్‌రెడ్డి, ఏపీఎం రెడ్డమ్మ, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'మాకు ఉద్యోగ భద్రతను కల్పించండి'


ధర్నా నిర్వహిస్తున్న వీఓఏలు

రాయచోటి అర్బన్ : వెలుగులో గత కొన్నేళ్ళుగా పని చేస్తున్న వీఓఏలకు వెంటనే ఉద్యోగభద్రతను కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సీఐటీయూ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు కలెక్టరేట్ ఎదుట వీఓఏలు ధర్నాను నిర్వహించారు. ధర్నానుద్దేశించి వారు మాట్లాడుతూ వీఓఏలకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. 65 సర్క్యులర్‌ను వెంటనే రద్దుచేయాలంటూ కోరారు. 45 సంవత్సరాల పైబడి వయస్సున్న వీఓఏలను తొలగించాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం వీఓఏల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణమ్మ, పరంజ్యోతి, రెడ్డెప్పలు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ రాయచోటి పట్టణ కార్యదర్శి ఎస్.ఫయాజ్, వీఓఏల సంఘం నేతలు ప్రసాద్, రమణారెడ్డి, రాణి, సుబ్రమణ్యం, చంద్రకళ, ప్రభాకర్, నారాయణ, ఓబులేశుతోపాటు జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన వీఓఏలు పాల్గొన్నారు.

నోటి శుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ


రాజంపేట రూరల్: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చిన్నికృష్ణ


రాయచోటి అర్బన్: పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు ఖదీర్‌బాషా

రాజంపేట రూరల్ : నోటి శుభ్రత పాటించటం ద్వారా అనారోగ్యాన్ని ఆమడ దూరంలో ఉంచవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.చిన్నికృష్ణ అభిప్రాయపడ్డారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రభుత్వ దంత వైద్యులు డాక్టర్ మస్తాన్‌రావ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీనీ ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మస్తాన్‌రావ్ నోటి శుభ్రతను ఏ విధంగా పాటించాలో వివరించారు. నోటి క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతి ఒక్కరు నోటి శుభ్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. ర్యాలీలో ఏహెచ్ వైద్యబృందం, ఏహెచ్ సూపరిండెంట్ డాక్టర్ పీవీఎన్ రాజు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంఎస్‌లు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి అర్బన్ : ప్రతి ఒక్కరూ నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని ప్రభుత్వ దంత వైద్యుడు ఖదీర్‌బాషా అన్నారు. సోమవారం పాత రాయచోటి మున్సిపల్ వర్కర్స్ కాలనీలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో నోరు శుభ్రతపై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. డాక్టర్ ఖదీర్‌బాషా మాట్లాడుతూ ప్రతిరోజును నోటిని రెండు పర్యాయాలు శుభ్రపరచుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. పొగాకు, గుట్కాలు, పచ్చివక్క, పాన్‌పరాగ్ వంటి వాటిని సేవిస్తే క్యాన్సర్, అల్సర్‌ల బారిన పడక తప్పదన్నారు. ప్రతి ఒక్కరూ వీటికి దూరంగా ఉండాలన్నారు. ఫొటోలు, ఫ్లెక్సీలు చూపిస్తూ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం దంతాలను ఎలా శుభ్రం చేసుకోవాలో వివరించారు. అనంతరం టూత్‌బ్రష్‌లు, పేస్ట్‌లను ఉచితంగా అందజేశారు.

నేలకొరిగిన అరటి తోటల పరిశీలన


వివరాలను సేకరిస్తున్న ఉద్యాన అధికారులు

రాజంపేట రూరల్ : మండల పరిదిలోని హస్తవరం, పెద్దకారంపల్లి, ఆకేపాడు రైతు భరోసా కేంద్రాల పరిధిలో శుక్రవారం రాత్రి వీచిన గాలులకు, కురిసిన వర్షానికి నేలకొరిగిన అరటి పంటను మండల ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ మండలంలో 168 ఎకరాలలో అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలియజేశారు. అదే విధంగా 5 ఎకరాలలో కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు తెలియజేశారు. క్షేత్ర స్థాయిలో వీహెచ్ఏలు, వీఏఏలు, వీఆర్‌ఓలు దెబ్బతిన్న పంటలను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నట్లు తెలియజేశారు. నష్టపోయిన రైతుల తుది జాబితాను త్వరతగతిన పూర్తి చేసి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరిశీలనలో వీహెచ్ఏలు శివప్రసాద్, రామ్మోహన్‌రాజు, సంపూర్ణ, వీఆర్‌ఓ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

పీలేరు రూరల్ : స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగాజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 9 గంటల నుంచి జరిగే జాబ్ మేళాకు అపోలోఫార్మసి, ఫ్యూచర్ టెక్ టాలెంట్ ఎడ్జ్, ముత్తూట్ ఫైనాన్స్, ఐసీసీ బ్యాంక్ కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు తమ సర్టిఫికెట్లతో జాబ్ మేళాలో పాల్గొనాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7799587687 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా మస్తాన్‌వలి దర్గా ఉరుసు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె సిటీ: స్థానిక కోటవీధిలోని మస్తాన్‌వలి దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంధం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉరుసును పురస్కరించుకుని దర్గాను రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా దర్గాను సందర్శించి చాదర్‌ను సమర్పించారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేని చాదర్ సమర్పించారు.

'స్పందన'పై ప్రజల్లో నమ్మకం కలిగించాలి

రాయచోటి అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్పందన' పట్ల ప్రజల్లో బలమైన నమ్మకాన్ని కలిగించేలా పనిచేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ సత్యనారాయణ, భూముల సర్వేవిభాగం సహాయ సంచాలకుడు జయరాజ్‌లు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన వినతుల పరిష్కారానికి ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు.

సమస్యలు ఇలా..

- సుండుపల్లెకు చెందిన దొరస్వామినాయుడు కలెక్టర్‌తో మాట్లాడుతూ 2355/1 సర్వే నంబరులోని 46 సెంట్ల భూమిని తాను మాలేపాటి శైలజ వద్ద కొనుగోలు చేశానన్నారు. అయితే సదరు భూమి ఆన్‌లైన్‌లో ఇతరుల పేరుతో నమోదు చేశారన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు.
- గతంలో తమ ఊరికి ఆర్టీసీ బస్సు వచ్చేదని, ప్రస్తుతం రావడం లేదని పరికలబండ బిడికి వాసులు కలెక్టర్‌కు అర్జీ సమర్పిం చారు.
- సుండుపల్లెకు చెందిన ఎ.వెంకటస్వామి మాట్లాడుతూ సర్వే నంబరు 1261/7లో తన భూమిని కొందరు తనకు తెలియకుండానే ఆన్‌లైన్ చేయించుకున్నారని ఫిర్యాదు చేశారు.

అలాగే పలువురు బాధితులు కలెక్టర్‌కు, అధికారులకు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.